క్లుప్తంగా

సీఅండ్‌ఎండీని కలిసిన జీఎంలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎంలు

రామగిరి: సింగరేణి సంస్థ సీఅండ్‌ఎండీ బలరాం నాయక్‌ను శనివారం ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్ రావు, కె.వెంకటేశ్వర్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆర్జీ–3 ఏరియాలోని భూసేకరణకు సంబంధించిన విషయాలు, గనుల ఉత్పత్తి వివరాలను జీఎం సుధాకర్ రావు వివరించారు. ఏపీఏ గనికి సంబంధించిన వివరాలను, భవిష్యత్‌లో గనిలో ఉత్పత్తి కోసం చేపట్టనున్న చర్యలను జీఎం కె.వెంకటేశ్వర్లు తెలియజేశారు. ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఏరియా సేఫ్టీ అధికారి సీహెచ్.వెంకటరమణ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, ఏరియా సెక్యూరిటీ అధికారి ఈ.లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఏపీఏలో ఆపరేషన్స్ డైరెక్టర్ పర్యటన



గనిలో పర్యటిస్తున్న ఆపరేషన్స్ డైరెక్టర్

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో శనివారం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్.వీ.కె.శ్రీనివాస్ పర్యటించారు. జీఎం వెంకటేశ్వర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. లాంగ్ వాల్‌లో పనులు ముందుకు సాగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. జీఎం కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ కె.సీతారామం, ఎస్‌వోటూ జీఎం డీ.బైద్య, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ టీ.రఘురాం, ఎస్‌వోఎం కె.జనార్దన్, సేఫ్టీ అధికారి ఎం.రమేశ్ పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా ఇక్బాల్ టీమ్, రన్నర్‌గా జగదీశ్ టీమ్ నిలిచాయి. విజేతలకు సీఐ జగదీశ్ బహుమతి ప్రదానం చేశారు. ఎస్సైలు వినీత, వెంకటకృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్ఎల్‌పీ పదోన్నతి ఉత్తర్వులు అందజేత



ఉత్తర్వులు అందజేస్తున్న ఎస్‌వోఎంలు

రామగిరి: ఏపీఏ గనిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులను శనివారం ఎస్‌వోఎంలు కె.జనార్దన్, కె.తిరుపతి అందజేశారు. ఏపీఏ గనిలో 17మంది ఉద్యోగులు అర్హత కలిగి ఉన్నారని వారికి జీఎం కె.వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు టైం బాండ్ ప్రమోషన్స్ అందజేసినట్లు పేర్కొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని రాజీవ్ తండాలో పరిసరాల పరిశుభ్రత, మాదక ద్రవ్యాల వినియోగంపై శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత చెడు వ్యసనాలను వదిలి సమాజ నిర్మాణానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దయానర్సింగ్, స్నేహలత, బుర్ర శంకర్‌గౌడ్, వెంకటస్వామి, రవీందర్, సరిత, స్పందన, స్వప్న, శ్వేత, స్పందన పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఎలిగేడు: మండలంలోని లాలపల్లికి చెందిన బైరి పద్మకు ఆసుపత్రి (నిమ్స్ హాస్పిటల్) చికిత్స కోసం రూ.2లక్షల ఎల్‌వోసీని వారి కుటుంబసభ్యులకు శనివారం ఎలిగేడు మండలం శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు విజయరమణారావు అందజేశారు. నిరుపేద కుటుంబానికి ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, కొప్పెర తిరుమల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావసరాలకు అనుగుణంగానే అభివృద్ధి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని: రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నారని, వారికి మాట ఇచ్చిన విధంగానే ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మంథని మండలం నాగారంలో రూ.16 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ, 22.40లక్షల అంచనా విలువతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అర్హులకు లబ్ధి చేకూరేలా, ఇల్లు లేని నిరుపేదకు ఇళ్లు అందించాలని, పెన్షన్లు లేని వారికి పెన్షన్‌లు అందించాలనే ఉద్దేశంతో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు సేకరించామన్నారు. ఎంపీపీ శంకర్, సర్పంచ్ మల్లేశ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మంథనిలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి శ్రీధర్‌బాబు చెక్కులు పంపిణీ చేశారు. డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి మండలాకు చెందిన 30 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

రామగిరి: ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కల్వచర్ల నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ గంట పద్మ ఆధ్వర్యంలో మహిళలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, నాయకులు తోట చంద్రయ్య, కొట్టె సందీప్, వేము కనకయ్య, కొలిపాక సారయ్య, బండారి సదానందం, కాట రాజేందర్‌గౌడ్, కాట శంకర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం

పల్లె దవాఖానల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కల్వచర్లలో పల్లెదవాఖానాను ఆయన ప్రారంభించారు.

మంత్రికి చిత్రపటం బహూకరణ

మండలంలోని కల్వచర్ల గ్రామ పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి చిత్రపటం బహూకరించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అనంతరం స్థానిక హనుమాన్ ఆలయంలో పూజలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి దిగిన ఫొటోను గ్రామానికి వచ్చిన సందర్భంగా అందజేశారు. క్లాత్‌పై చేతితో వేసిన డ్రాయింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సమష్టిగా ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అధికారులు, కార్మికులు సమష్టిగా ముందుకు సాగాలని సంస్థ సీ అండ్ ఎండీ ఎన్.బలరాం కోరారు. శనివారం రామగుండం రీజియన్‌లో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి పర్యటనకు వచ్చిన ఆయనకు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. తొలుత జీడీకే–2వ గనిలోకి వెళ్లిన సీఎండీ.. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు. అనంతరం ఏరియా జీఎంలతో బొగ్గు ఉత్పత్తి మెరుగుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆర్జీ–1, 2, 3, ఏఎల్పీ, బెల్లంపల్లి రీజియన్‌లోని అన్ని ఏరియాల బొగ్గు ఉత్పత్తి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీఎం(పర్సనల్– ఐఆర్‌పీఎం) బి.హనుమంతరావు, ఆర్జీ–1, 2, 3, ఏపీఏ, శ్రీరాంపూర్ జీఎంలు చింతల శ్రీనివాస్, ఎల్‌వీ సూర్యనారాయణ, ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎండీ సుడిగాలి పర్యటన

సీఎండీ బలరాం తొలుత ఓసీపీ–3 సీహెచ్‌పీకి చేరుకున్నారు. జీడీకే–2వ గనిలోని దిగి పనిస్థలాల వద్దకు వెళ్లారు. అనంతరం ఇల్లెందు క్లబ్‌లో అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. సింగరేణి ఆస్పత్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, క్యాంటీన్ సుపరిశీలించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీడీకే–2వ గనిలోని పనిస్థలాల్లో సీఎండీ బలరాం

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం గోదావరిఖనికి వచ్చిన సీఅండ్‌ఎండీ బలరాంకు వినతిపత్రం ఇచ్చారు.

సీఅండ్‌ఎండీని కలిసిన సీతారామయ్య

గోదావరిఖని: రామగుండం రీజియన్ పర్యటనకు మొదటిసారిగా వచ్చిన సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి భూనిర్వాసిత సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: సింగరేణి సంస్థ భూనిర్వాసిత, ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సంస్థ సీఎండీ బలరాం నాయక్‌కు పెద్దపల్లి డీసీసీ కార్యదర్శి ఎండీ రహీం వినతిపత్రం ఇచ్చారు.

నేటి ఓటమే.. రేపటి గెలుపునకు దిక్సూచి

జ్యోతినగర్: నేటి ఓటమే.. రేపటి గెలుపునకు దిక్సూచి అని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో స్టేట్ లెవల్ తెలంగాణరూరల్ గేమ్స్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్ విజేతలకు బహుమతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అండర్12–16, అండర్ 17–22 జూనియర్స్, సీనియర్స్ విభాగంలో గెలుపొందిన విజేతలను ఆయన అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, సీనియర్స్ విభాగాల్లో 18 జట్లు పాల్గొన్నాయి. పెద్దపల్లి సీనియర్స్ విన్నర్‌గా పెద్దపల్లి, రన్నర్‌గా కరీంనగర్, జూనియర్ విభాగంలో రంగారెడ్డి విన్నర్, రన్నర్‌గా సిద్దిపేట జట్లు నిలిచాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్ పాషా, మల్లేశ్ పాల్గొన్నారు.



ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

మైనార్టీల సమస్యలు పరిష్కరిస్తా

గోదావరిఖని: నియోజకవర్గంలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. కార్పొరేషన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాజా నజీమొద్దిన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో సన్మానించారు. సంక్షేమ పథకాలను ప్రతి నిరుపేద ముస్లిం కుటుంబాలకు చేరేలా చూస్తానన్నారు.

కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించాలి

సుల్తానాబాద్: పదేళ్లుగా డీ–86 కాలువలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను తొలగించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సాగునీరు విడుదలయ్యే ప్రాంతం రేవెళ్లను అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు, ఉపకాలువలకు సాగునీరు వచ్చే పలు కాలువలు పదేళ్ల నుంచి మరమ్మతు చేయలేదు. దీంతో కాలువలు కూలిపోవడంతో పాటు పలురకాల చెత్త పేరుకుపోయింది. దీంతో రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. అధికారులు హుటాహుటిన నీరు నిలవకుండా సిల్ట్, చెత్తను తొలగించివేశారు. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలతో పాటు మారుమూల ప్రాంతాలకు సాగునీరు అందించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని, రైతులకు అండగా నిలవాలని సూచించారు. ఎస్సారెస్పీ డీఈ మధుమతి, లస్కర్లు లక్ష్మణ్, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్య గౌడ్, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సామరాజేశ్వర్‌రెడ్డి, గజనవేణి సదయ్య, పట్టణ అధ్యక్షుడు అబ్బయ్యగౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్, సతీశ్, గోపాల్ పాల్గొన్నారు.



కాలువ సందర్శనలో ఎమ్మెల్యే విజయరమణారావు

విజేతలకు బహుమతి ప్రదానం

ఓదెల: మండలంలోని గూడెంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే విజయరమణరావు శనివారం బహుమతి ప్రదానం చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, నాయకులు కామిని శ్రీనివాస్, తిట్ల రాము, తిప్పారపు సంపత్, కిషన్ పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే పీహెచ్‌సీకి తాళం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకుడు సదయ్య

ఓదెల: మండలంలోని కొలనూర్ పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది విధులకు డుమ్మాకొట్టారని స్థానిక వార్డుసభ్యురాలు వీర్ల రజిత, ఆమె భర్త వీర్ల సదయ్య శనివారం నిరసన తెలిపారు. షుగర్ మందుల కోసం వెళ్తే మధ్యాహ్నం వరకే వైద్యసిబ్బంది తాళంవేసి విధులకు డుమ్మాకొట్టారని హాస్పిటల్ ఎదుట సదయ్య బైటాయించారు. హాస్పిటల్ వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఈ విషయంపై జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గోదారంగనాథుల కల్యాణం నిర్వహించారు.

మార్కెట్‌లో సంక్రాంతి సందడి



కోల్‌సిటీ: సామగ్రి కొనుగోళ్లు



పెద్దపల్లిరూరల్: జెండాకూడలిలో

కోల్‌సిటీ/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్: సంక్రాంతి పండుగ వేడుకతో శనివారం జిల్లాలోని మార్కెట్లు, ప్రధాన రహదారులు కిటకిటలాడాయి. పూజా సామగ్రి, గొబ్బెమ్మల కోసం నవధాన్యాలు, పిండిగడ్డి, గరకపోసలు, ఆవు పేడ, పండ్లు, పువ్వులు, చెరుకుగడ్డలు, పతంగులు, ముగ్గుల రంగులను కొనుగోలు చేస్తున్నవారితో రహదారులు కిటకిటలాడాయి.

జాతీయ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

సుల్తానాబాద్: జాతీయస్థాయి అండర్–19 టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు వశిష్ట, సాత్విక్, కార్తికేయలను విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి శనివారం అభినందించారు. వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో జరిగిన టార్గెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.



అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి



ఏటా వచ్చే సంక్రాంతికి పండుగల్లో ప్రత్యేక స్థానం ఉంది. మూడు రోజుల ముచ్చటైన పండుగలో సకినాలు ఎంత స్పెషలో.. గాలిపటాల ఆటా అంతే. పాఠశాలలకు సెలవులు మొదలైతే చాలు.. చిన్నారుల్లో ఎక్కడాలేని ఆనందం.. డబ్బాకు దారం.. చేతిలో పతంగి ఉంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి మరో ధ్యాస ఉండదు. నేలపై నిలుచున్నా.. చూపు మాత్రం ఆకాశంవైపే.. రంగురంగుల పతంగుల విహంగనం.. గగన వీధుల్లో పగటి నక్షత్రాలను మరిపిస్తుంది.

గాలిపటం

సంక్రాంతి స్పెషల్

- ‘పగటి నక్షత్రాల’ సందడి షురూ
- వీధివీధినా పతంగుల సంబరం
- ఆటలో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం

కరీంనగర్/సప్తగిరి కాలనీ(కరీంనగర్)/సిరిసిల్ల టౌన్/కోల్‌సిటీ/గోదావరిఖని టౌన్(రామగుండం)/జగిత్యాల/గొల్లపల్లి(ధర్మపురి)/జగిత్యాల టౌన్: పతంగుల పండుగ నిజాం కాలంలో గొప్ప ఆదరణ పొందింది. దీని పుట్టుక ఆసక్తికరమే. సముద్ర తీర ప్రాంతాలు, మైదానాలు, ఎడారుల్లో గాలి తీవ్రతను.. వాటాన్ని తెలుసుకునేందుకు ఆ రోజుల్లో తేలిక పాటి వస్తువులను గాలిలో ఎగురవేసేవారు. అవే పతంగుల పుట్టుకకు కారణమయ్యాయి. రాజస్థాన్‌లోని అల్వర్‌కు చెందిన మౌజీ 1872లో మొదటగా పిల్లల సరదా కోసం పతంగాన్ని ఎగురవేసినట్లు చెబుతారు. అలా ఉత్తరాదిలో పుట్టిన పతంగి దక్షిణాది సంస్కృతిలో భాగమైపోయిందని కథనం. మొఘలులు సైతం పతంగులపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారని చరిత్రకారులు చెబుతున్నారు. రాకుమార్తెలు, రాజులు తమ ప్రేమ సందేశాన్ని పంపే సాధనాలుగా వీటిని ఉపయోగిచేవారని పేర్కొంటున్నారు.

పోటాపోటీగా పేంచీలు

గగనతలంలో విహరిస్తున్న గాలిపటానికి పేంచీ వేసి, ఓడించడం ఓ ప్రత్యేకత. ప్రత్యర్థి గాలిపటం ధాటికి తట్టుకోవడానికి గట్టి కరుకుదనం కలిగిన మాంజాను ఉపయోగిస్తారు. పేంచీ వేసి, అవతలి వ్యక్తి పతంగి గాలిలో ఎగిరిపోతుంటే(అప్పా) ఎంతగానో ఆనందిస్తుంటారు. అప్పా అయిన గాలిపటాన్ని చేజిక్కుంచుకోవడానికి చిన్నారులు, యువకులు పరుగెత్తుతుంటారు.

పలు రంగులు, చక్కని ఆకృతితో..

రాత్రి సమయంలోనే ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తాయి. కానీ సంక్రాంతి వచ్చిందంటే పగలు సైతం నక్షత్రాల వలే పతంగులు దర్శనమిస్తాయి. పలు రంగులు, చక్కని ఆకృతితో ఆకట్టుకునేలా (సినీనటులు, కార్టూన్లు, రాజకీయ నాయకుల చిత్రాలు, చార్మినార్, సీతాకోకచిలుక, చేపల ఆకారంలో) ఉన్న పతంగులు మార్కెట్లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారులను ప్రత్యేకంగా ఆకర్షించేలా ఫిష్‌కటింగ్, చోటాభీమ్, బెన్‌టెన్, యాంగ్రీబర్డ్స్, డోరెమాన్, బాహుబలి వంటి గాలిపటాలు అందుబాటులోకి వచ్చాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- గాలిపటాన్ని వీలైనంత వరకు మైదానానికి వెళ్లి ఎగురవేయాలి.
- మేడపై, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెట్లపైకి ఎక్కి పతంగి ఎగురవేయడం అత్యంత ప్రమాదకరం.
- విద్యుత్ తీగలకు పతంగి తగలనీయరాదు. పొరపాటున వాటికి చిక్కుకున్నా తీయొద్దు.
- చెట్లపై చిక్కుకున్న పతంగిని కొమ్మపై ఎక్కి తీయడం ప్రమాదకరం.
- దారం తెగి ఎగిరిపోతున్న పతంగిని పట్టుకోవడానికి వీధుల్లో, రహదారులపై పరుగెత్తవద్దు. వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.
- రైలు పట్టాల సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పతంగిని ఎగురవేయవద్దు.
- చైనా మాంజాను వినియోగించవద్దు. దానితో పక్షుల పాణాలకు ప్రమాదం ఉంది.

సూర్యకిరణాలతో లాభం..

సంక్రాంతి సందర్భంగా సూర్యుడు మకర రాశిలోకి మారుతుంటాడు. ఈ సమయంలో మానవ శరీరంపై భానుని కిరణాలు పడితే వ్యాధి నిరోధక శక్తి పెరిగి, రోగాలను దరిచేయనీయవు.

మాంజా, పతంగుల ధరలు..

పతంగులను ఎగురవేసేందుకు వినియోగించే చైనా మాంజా ఇప్పుడు లభించడం లేదు. వాడొద్దని ప్రభుత్వం నిషేధం విధించింది. పతంగుల పరిమాణం, నాణ్యత, రంగులను బట్టి ధరలు ఉన్నాయి. రూ.5 నుంచి రూ.100 లోపు గాలిపటాలు, రూ.10 నుంచి రూ.300 వరకు మాంజా లభ్యమవుతున్నాయి.

పలు విషాద ఘటనలు..

- హైదరాబాద్ అత్తాపూర్‌లో శనివారం స్నేహితులతో కలిగి గాలిపటం ఎగురవేయడానికి మేడపైకి వెళ్లిన తనిష్క్ (11) విద్యుత్‌షాక్‌తో చనిపోయాడు.
- పాత మంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జిపై రెండేళ్ల క్రితం చైనామాంజాకు తగిలి పస్తం భీమయ్య (40) అనే వలస కూలీ మృతి చెందాడు.
- గతేడాది నల్గొండలో భార్యతో కలిసి ఓ కూలి తన మోపెడ్‌పై వెళ్తుండగా, చైనా మాంజా తగిలి గొంతును కోయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో ఓ వ్యక్తి తన ఇద్దరు పిల్లలను కారులో తీసుకెళ్తుండగా విండో నుంచి బయటకు చూస్తున్న ఆ పిల్లల గొంతును చైనా మాంజా కోయడంతో ఇద్దరూ చనిపోయారు.

రెండురోజుల ముందు నుంచే..



సంక్రాంతికి రెండు రోజుల ముందునుంచే మేము మా ఇంటి డాబాపై పతంగులను ఎగురవేయడం ప్రారంభిస్తాం. నిజామాబాద్‌లోని ఇంట్లో అందరం కలిసి కైట్ ఫెస్టివల్ జరుపుకుంటాం. – చల్ల స్వరూపారాణి, డిప్యూటీ మేయర్, కరీంనగర్

నాన్నతో పోటీ పడతా..



చిన్నప్పటి నుంచి పతంగులు ఎగురవేయడమంటే ఇష్టం. సంక్రాంతి వచ్చిందంటే నాన్నతో కలిసి ఇంటి డాబాపై ఎగురవేస్తూ ఎంజాయ్ చేస్తా. నాన్నతో పోటీ పడటం సంతోషాన్నిస్తుంది. – పదాల రిషితాప్రసాద్, మెడికో, జగిత్యాల

ఫ్రెండ్స్‌తో కలిసి ఎగురవేస్తా



ప్రతీ సంక్రాంతికి నేను మా ఫ్రెండ్స్‌తో కలిసి పతంగులు ఎగురవేస్తా. పొద్దున ఇంటి ముందు ముగ్గులు వేశాక గాలిపటాలతో ఆడుకుంటాం. చాలా ఆనందంగా ఉంటుంది. – గుర్రం హరిణి, చొప్పదండి

కోరిన డిజైన్లలో..



కోరిన డిజైన్లలో పతంగులకు ఆర్డర్ ఇచ్చి, తెప్పిస్తున్నాం. సిరిసిల్ల పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మావద్దే కొనుగోలు చేస్తారు. అందరికీ అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నాం. – ఎలగందుల రమేశ్, చిరువ్యాపారి, సిరిసిల్ల

ప్రజల్లో అవగాహన రావాలి




నిషేధిత మాంజాను వాడకూడదని ప్రజల్లో అవగాహన రావాలి. వన్యప్రాణుల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నాం. జీవాలకు ఆపాయం కలిగితే 96978 87888కు ఫోన్ చేయాలి. – ప్రదీప్ పరకుత్, రాష్ట్ర అధ్యక్షుడు, యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ, గోదావరిఖని

చైనా మాంజా ప్రమాదకరం



జగిత్యాల క్రైం: గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాను వినియోగించడం ప్రమాదకరం. ఇది పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తుంది. రాష్ట్రంలో ఈ మాంజా పూర్తిగా నిషేధించబడింది. – సన్‌ప్రీత్‌సింగ్, జగిత్యాల ఎస్పీ



సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన నర్ల పోచాలు (62) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం మత్తులో పోచాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మార్కండేయకాలనీలో మరో చోరీ

గోదావరిఖని: మార్కండేయ కాలనీలో శనివారం చోరీ జరిగింది. రెయిన్‌బో స్కూల్‌లైన్ ఏరియాలో ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లిన సమయంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. రెండురోజుల క్రితం రెండు చోరీలు, తాజాగా మరో చోరీ జరగడంతో ప్రజలు భయపడుతున్నారు.